ప్రజాశక్తి

శుక్రవారం 16 డిసెంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







సిఎం జగన్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాగార్జున, కలెక్టర్ విజయకృష్ణన్

21న సిఎం జగన్ రాక

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నాగార్జున, కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 21వ తేదీన బాపట్ల జిల్లాకు వస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్‌కు గురువారం సమాచారం అందడంతో సభా ప్రాంగణం కోసం మంత్రితో కలిసి జిల్లా కలెక్టర్ విజయకష్ణన్ పలు ప్రాంతాలను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబ్‌ల ద్వారా వినియోగించే బైజూస్ యాప్‌ను ఈ నెల 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారికంగా ప్రారంభించ నున్నారని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో అమర్తలూరు మండలంలోని హైస్కూల్ పెదపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, కొల్లూరు మండలం కొల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. నాడు-నేడు కింద రూ.35.30 లక్షలతో పాఠశాలను అభివద్ధి చేసినందున కొల్లూరులోనే రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని ప్రాథమికంగా గుర్తించామన్నారు. అధికారికంగా సీఎం పర్యటన ఖరారు కావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి హెలీప్యాడ్ స్థలాన్ని మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లూ చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ విజయకష్ణన్ ఆదేశించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో పార్థసారథి, జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

- పొగాకు నాట్లకు మళ్లీ రైతుల సన్నాహాలు
- దెబ్బతిన్న పంటల స్థానంలో నువ్వు, పెసర, శనగకు అవకాశం
- ఇన్‌పుట్ సబ్సిడీలు, ఎరువులు, విత్తనాలపై కనిపించని స్పష్టత

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తుపానుకు దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ అవకాశం ఉన్న పంటలను సాగు చేసుకునేందుకు రైతులు సన్నాహాల్లో ఉన్నారు. ఏఏ పంటలు వేసుకోవడానికి అవకాశం ఉందో వ్యవసాయశాఖ కూడా కసరత్తు చేస్తోంది. దెబ్బతిన్న పంటల స్థానంలో ప్రస్తుతం శనగ, పెసర, నువ్వు పంటలు సాగు చేసుకోవచ్చని జేడిఏ శ్రీనివాసరావు చెబుతున్నారు. జనవరి లోనూ కొన్ని పంటలకు సమయం ఉంటుందని తెలిపారు. రైతులు వారికున్న వెసులుబాటును బట్టి సాగు చేసుకోవచ్చన్నారు.

రైతులు కూడా సమయాన్ని పరిగణలోకి తీసుకుని అవకాశం ఉన్న పంటలను వేసుకునేందుకు ఆలోచిస్తున్నారు. మరో వారం రోజులు చూశాక పంటల పరిస్థితి ఏమిటన్నది తేలనుంది. ఎంత మేరకు వస్తుంది? మళ్లీ సాగు చేస్తే లాభమా? నష్టమా? ఉన్నవాటినే ఉంచుకుంటే సరిపోతుందా? అనే అంచనాల్లో తర్జనభర్జన పడుతున్నారు. అయితే కొన్ని రకాల పంటలు పూర్తిగా పోయాయి. వాటిల్లో పొగాకు మినుము, బొబ్బర్లు ఉన్నాయి. ప్రాథమిక అంచనాల మేరకు వ్యవసాయశాఖ పరిధిలోని పంటలు 67,265 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. వరి 4344 ఎకరాలు, పత్తి 553 ఎకరాలు, బొబ్బర్లు 17,805 ఎకరాలు, మినుము 44441 ఎకరాలు దెబ్బతిన్నాయి. 35 మండలాల్లో 510 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. పొగాకు నష్టం ఎన్ని ఎకరాలు అనేది ఇంకా బోర్డు అధికారులు అంచనా వేయలేదు. పొగాకు సుమారు 25 వేల ఎకరాలకుపై గానే దెబ్బతింది. ఇప్పటికే పొగాకు రైతులు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ పెట్టారు. మళ్లీ నాట్లు వేయాలన్నా ఎకరాకు కనీసం రూ.10 వేలు కావాలి. కూలీలు, ఇతర అవసరాలకు పెట్టుబడి కావాలి. ఇప్పటికే పొగాకు రైతులు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. అవన్నీ నీటిలోనే పోయాయి. గురువారం నాడు తెలుగుదేశం ఎమ్మెల్యేలు, నేతలు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను కలిసి చర్చించారు. బోర్డు నుంచి రుణాలిచ్చి.. రైతులను ఆదుకోవాలని కోరారు. పెట్టుబడి కోసం సాయం చేయాలన్నారు. బోర్డు అధికారుల స్పందన ఆశించినంత సానుకూలంగా లేదు. కేంద్రం నుంచి నిధులు ఇస్తే తప్ప బోర్డు ఏమీ చేయలేని స్థితిలో ఉంది. సిపిఎం జిల్లా నేతలు జేసీని కలిసి పంటనష్టాలపై వినతిపత్రం ఇచ్చారు. రైతులను ఆదుకోవాలని కోరారు. మిగతా పంటలు ▶ 2లో



రైతులకు పరిహారమిచ్చి ఆదుకోండి

పొగాకు బోర్డు ఈడీకి టిడిపి నేతల వినతి ▶ 5లో

అధికార పార్టీ నేతల్లో అంతర్మథనం

- నేడు వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులతో సిఎం జగన్ సమీక్ష
- 'గడపగడపకూ'లో ర్యాంకుల ఆధారంగా టిక్కెట్ దక్కేనా.?

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రాష్ట్రంలో అధికార పార్టీకి చెందిన వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల రాష్ట్రస్థాయి సమావేశం పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం జరగనుంది. పార్టీకి చెందిన వైసిపి ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులుగా ఉన్నవారు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ దక్కించుకోవాలంటే ముందుగా పార్టీ నిర్దేశించిన గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం అమలు పరీక్షలో ఉత్తీర్ణులవ్వాల్సి ఉందన్నారు. ఇప్పటికే పార్టీ అధినేత జగన్ స్పష్టం చేశారు. ఈ ఏడాది మే 11న ప్రారంభించిన గడపగడపకూ.. కార్యక్రమం గురించి జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇందుకోసం ఇప్పటికే మూడు సార్లు సమీక్షలు జరిపిన జగన్ మరోసారి సమీక్ష చేయనున్నారు. దీంతో పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణత కోసం 'ఎక్కే గడప.. దిగే గడప..' అన్నట్లుగా తమ నియోజకవర్గాల్లో సచివాలయాల వారీగా పర్యటనలు చేశారు. ఇప్పటివరకు జరిగిన గడపగడపకూ.. ప్రభుత్వ కార్యక్రమం అమలు సమీక్షా సమావేశాల్లో జగన్ తగిన దిశానిర్దేశం చేశారు. సక్రమంగా తిరగని వారిని హెచ్చరించారు. జియోట్యాగింగ్ సిస్టమ్ పద్ధతిలో పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు ఆయా నియోజకవర్గాల్లో ఎన్ని రోజులు గడపగడపకూ.. తిరిగారు. ఎన్ని ఇళ్లు సందర్శించారు.. అనే లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా పిఏలను నియమించారు. గత సమావేశాల్లో గడపగడపలో వెనుకబడిన వారిని హెచ్చరించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాకపోతే టిక్కెట్ ఇచ్చేది లేదన్నారు. ఈ నేపథ్యంలో అందరు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు గడపగడపకూ.. కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన రీతిలో సచివాలయాల వారీగా గృహాలు సందర్శించారు. ఇలా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు గృహాల సందర్శన సందర్భంగా ప్రజల నుంచి వారికి వస్తున్న అనుకూలత, వ్యతిరేక అంశాల విషయమై నిగూఢ సర్వే నిర్వహిస్తున్నారు. ఆ సర్వేల్లో వస్తున్న అంశాల ఆధారంగా గ్రేడ్‌లు ఇస్తూ అభ్యర్థుల ఖరారు చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ, ఓట్ల వేట అంశాలకు ఈ గడపగడపకూ.. ప్రభుత్వ కార్యక్రమానికి సంబంధం ఏమిటని మొదట్లో పలువురు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు ఈ కార్యక్రమం గురించి అంతగా పట్టించుకోనప్పటికీ తరువాత కాలంలో సీరియస్‌గా తీసుకొని.. గడపగడపకూ.. తిరుగుతున్నారు. ఇలా తిరిగే సమయంలో వారి రాజకీయ భవిష్యత్ తేలిపోతోంది. ప్రతిరోజు తిరిగినా కొందరు నేతల రిపోర్టులు వారికి వ్యతిరేకంగా వస్తున్నాయి. కొందరు నేతలు తక్కువగా తిరిగినా నియోజకవర్గం నుంచి మద్దతు లభిస్తుంది.



'గడపగడపకూ..' కార్యక్రమంలో రావి రామనాథంబాబు (ఫైల్)

గడపగడపకూ తిరిగినా..

బాపట్ల జిల్లాలోని వేమూరు, బాపట్ల నియోజకవర్గాల్లో మాత్రమే వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. చీరాల నుంచి టిడిపి తరపున గెలుపొందిన కరణం బలరాం వైసిపికి మద్దతు పలికారు. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో టిడిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ కారణంగా వేమూరులో వైసిపి ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున, బాపట్లలో ▶ 2లో

అమరజీవి త్యాగం మరువలేనిది

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఒంగోలు సివిఎన్ రీడింగ్ రూమ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి జిల్లాపరిషత్ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో పొట్టి శ్రీరాములు ప్రాణార్పణం చేసిన ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పోరాట స్ఫూర్తితో రాష్ట్ర సర్వతోముఖాభివద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనటంతో పాటు దళితులకు దేవాలయ ప్రవేశం కోసం నిరాహార దీక్ష చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి అంజల, ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్, జడ్పీ ఛైర్‌పర్సన్

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

స్థానిక ప్రకాశం భవనం లోని వీడియో సమావేశ మందిరంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాన్ని అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి డిఆర్ఓ బిసిహెచ్ ఓబులేసు పూలమాల వేసి.. నివాళులర్పించారు. జిల్లా రెవిన్యూ అధికారి బిసిహెచ్ ఓబులేసు మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టరేట్ లోని కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, పర్యవేక్షకులు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఊతకోలు శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-పొదిలి

తుఫాన్ ప్రభావంతో పంట పొలాల్లోకి చేరిన నీటిని బయటకు పొలాలను ఆరబెట్టి పంటలను కాపాడుకొనేందుకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. దర్శి ఎడిఎ అర్జున్ నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మూగ చింతల, కొండాయపాలెం, కెకెమిట్ల మండలంలోని పెదారికట్ల, చినారికట్ల గ్రామాలలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీ లించారు. అనంతరం పొదిలి వ్యవ సాయ శాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కంది, మినుము, అలసంద పంటలు తుఫాను ప్రభావానికి గురయ్యా యన్నారు. పంటలను కాపాడుకొనేందుకు రైతులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కార్యక్రమంలో దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు కె.అర్జున్ నాయక్, పొదిలి ఎఓ జైనులాబ్దిన్, దర్శి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వెంటేశ్వర రెడ్డి, ఉషారాణి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్ : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మండల పరిధిలోని వెల్లుపల్లి, పాములపల్లి గ్రామాలలో దెబ్బతిన్న శనగ, పొగాకు పంటలను వ్యవసాయ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్, ఎఓ విజయ భాస్కర్‌రెడ్డి గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. మరో నాలుగు రోజులు గడిస్తే కాని పంటలు ఏమేర దెబ్బతిన్న విష యాన్ని గుర్తించగలమని తెలిపారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈ -పంట నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తాము సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక ఎఓ మహబూబ్ బాషా, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇ -క్రాప్ నమోదు తప్పనిసరి

పొన్నలూరు : మండల పరిధిలోని రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను తమ గ్రామాల పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఎఓ పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ నెల 21లోపు ఇ-క్రాప్ నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు..రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పంట నష్టాన్ని పారదర్శకంగా నమోదు చేయాలి : ఎమ్మెల్యే

మద్దిపాడు : తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల నష్టాలను పారదర్శకంగా నమోదు చేయాలని ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం గ్రామంలోని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

వైఎస్ఆర్ విజయ్ భవన్‌లో నియోజక వర్గ స్థాయి అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కారణంగా కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్టాన్ని క్షేత్ర సాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేసి నివేదికలు ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు, చీమకుర్తి తహశీల్దార్లు,

అధికారపార్టీ నేతల్లో అంతర్మథనం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లెలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. చీరాలలో వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, పర్చూరులో వైసిపి ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు, అద్దంకిలో వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణచైతన్య గడపగడపకూ.. కార్యక్రమం చేపట్టారు. పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జి రామనాథంబాబు గడపగడపకూ.. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఆయన లెక్కల ప్రకారం అత్యధికంగా 176 రోజులు గృహాల సందర్శనలో పాల్గొన్నారు. జిల్లాలో రెండో స్థానంలో నిలిచారు. అయినా పర్చూరులో రానున్న ఎన్నికల్లో ఆయనకు పార్టీ టిక్కెట్ దక్కే అవకాశం లేదని తెలుస్తోంది. పర్చూరు నుంచి కాపు సామాజిక వర్గానికి చెందిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అక్కడ నూతన ఇన్‌ఛార్జిగా రానున్నారు. రామనాథంబాబు పరిస్థితి ఏమిటన్నది తేలాల్సి ఉంది. గడపగడపకూ..లో జిల్లాలో ప్రథమస్థానంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి ఉన్నారు. మూడో స్థానంలో వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తరువాతి స్థానాల్లో చీరాల నుంచి కరణం వెంకటేష్, అద్దంకి నుంచి బాచిన కృష్ణచైతన్య, రేపల్లె నుంచి మోపిదేవి వెంకటరమణ ఉన్నారు. వీరిలో ఎవరికి పార్టీ టిక్కెట్ దక్కుతుందనే విషయంలో స్పష్టత లేదు. ఇప్పటికే పర్చూరు నుంచి ఇన్‌ఛార్జి మార్పుపై స్పష్టత వచ్చింది. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే మూడు పర్యాయాలు నియోజకవర్గాల్లో సర్వే జరిపారు. అంతిమంగా ఆనివేదికల ఆధారంగానే పార్టీ టికెట్లు ఉంటాయనేది పార్టీ పెద్దల నుంచి వచ్చే సమాచారం. ఇందుకోసం ముందుగా గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ఆశావహులందరూ మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులవ్వడంతో పాటు జరుగుతున్న సర్వేలో కూడా మంచి గ్రేడ్ పొందాలి. లేకుంటే ఇన్‌ఛార్జి మార్పులు, అభ్యర్థుల ఖరారులో రేసు నుంచి తప్పుకోవలసి వస్తుందని చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

విషయానికి వస్తే మినుము, బొబ్బర్లు స్థానంలో నువ్వు, పెసర పంటలను వేసుకోవచ్చునని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. శనగకు కూడా అవకాశం ఉంది. పొగాకు స్థానంలోనూ శనగ వేస్తే మంచిదనే చర్చ ముందుకు వస్తోంది. రైతులు మాత్రం తర్జనభర్జన పడుతున్నారు. దెబ్బతిన్న పంటలను పార్టీల నేతలు పరిశీలించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉండగా పాలకపక్ష నేతలు మాత్రం పంట నష్టాలపై దృష్టి సారించలేదు. కనీసం రైతులను పరామర్శించేందుకు కూడా తీరిక లేకుండా ఉన్నారు. దెబ్బతిన్న పంటలను ఎన్యూమరేషన్ చేసి రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బాలినేనిని కలిసిన 'తాటిపర్తి'

శింగరాయకొండ : మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని ఆయన నివాస గృహంలో వైసిపి కొండపి నియోజకవర్గం నాయకులు తాటిపర్తి చంద్రశేఖర్, కొండపి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ షేక్ లియాఖత్ గురువారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఎస్తేరు

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎస్తేరురాణి

సంతనూతలపాడు రూరల్ : రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మండలపరిధిలోని మైనంపాడు జూనియర్ కాలేజీ విద్యార్థి కె.ఎస్తేరురాణిఒ ఎంపికైంది. కందుకూరులోని టిఆర్ఆర్ జూనియర్ కాలేజీలో హాకీ అండర్-19 విభాగం ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎస్తేరురాణి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ వనజ, పిఇటి రవికుమార్ అభినందించారు.

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యార్థులలో శాస్త్రీయ భావాలను పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడు తుందని ఎంపిపి పోరెడ్డి అరుణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొత్తం 70 సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనం తరం ఉత్తమ ప్రదర్శనలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బి.రాందాస్ నాయక్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు మునగాల చంద్ర ఇశేఖర్‌రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్సు ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపిపి

పెద్దారవీడు : పెద్దారవీడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానో పాధ్యాయుడు ఎన్. రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా విజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి బెజవాడ పెద్దగురవయ్య, జడ్‌పిటిసి యేర్వ చలమారెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తహశీల్దారు కష్టారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. ఎంపిడిఒ రాజుకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానంలో పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంఇఒ పి.శ్రీనివాసులు, సర్పంచి డి.చెన్నమ్మ, వైసిపి నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కాసు వెంకటరెడ్డి, గొట్టం వేణు గోపాలరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సైన్సు పోటీల ప్రదర్శనలు గురువారం నిర్వహిం చారు. ఈ పోటీలను ఎంఇఒ మస్తాన్ నాయక్ ప్రారంభించారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్సు ప్రదర్శనల్లో రాణించడం అభినందనీ యమని తెలిపారు. మండల పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు సైన్సు ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు శ్రీనివాసులు, సన్నిధి కిశోర్ కిరణ్‌కుమార్, మందగిరి వర్ధన్, బాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

- 48 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు రూ.2 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల

ఒంటరి మహిళలను పరిచయం చేసుకుంటాడు. ఆపై మాయ మాటలు చెబుతాడు.. నమ్మకంగా కొన్ని రోజులు వారి యోగక్షేమాలు తెలుసుకుంటాడు.. అనారోగ్య సమస్యలకు మంచి మాత్రలు ఉన్నాయని నమ్మబలికి మత్తు మాత్రలు ఇస్తాడు.. మాత్రలు మింగి మైకంలోకి వెళ్లాక వారి ఒంటిపై ఉన్న నగదుతో మాయమైపోతాడు.. ఇలా ఒంటరిగా ఉన్న మహిళలు టార్గెట్‌గా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను కటకటాల్లోకి పంపించారు చీరాల రెండో పట్టణ పోలీసులు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని జయంతి పేటకు చెందిన మేడికొండ ప్రసన్నకుమారిని, ఆయా ప్రాంతాల్లోని మహిళలను ఓ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. వారి ఆరోగ్యాన్ని వాకబు చేస్తూ అనారోగ్యానికి మందులు ఇస్తానని చెప్పి వారి ఇంటికి అక్టోబర్ 26న ఉదయం సుమారు 50 సంవత్సరాల పైబడిన ఆ వ్యక్తి వారి వద్దకు వచ్చాడు. మధుమేహం తగ్గేందుకు మాత్రలు ఇస్తానని మాయలతో నమ్మించాడు. దీంతో నిజమేనని నమ్మిన ఆమె నిద్రమాత్రలను మింగింది. వెంటనే మత్తులో ఇంట్లో పడిపోవటంతో పసన్నకుమారి మెడలోని గొలుసుతో పాటు ఇంట్లో ఉన్న మొత్తం 6 సవర్ల బంగారం,



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సోమశేఖర్

డబ్బాలో ఉన్న రూ.5 వేల నగదును దొచుకొని అక్కడ నుంచి పరారయ్యాడు. మత్తులో నుంచి బయటకు వచ్చేసరికి మహిళ ఒంటిపై ఉన్న బంగారం ఇంటిలో ఉన్న సొత్తుతో కనిపించకపోవడంతో అక్టోబర్ 29న బాధితురాలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందంతో దర్యాప్తును ప్రారంభించారు. ఇందులో భాగంగా చోరీ చేసిన నెల్లూరు జిల్లా కోట మండలం రామచంద్రాపురం కాలనీకి చెందిన చేవూరి చంద్ర అనే వ్యక్తిని బుధవారం సాయంత్రం బాపట్ల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. ఇతని వద్ద 48 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక జత పట్టీలు మొత్తం రూ.2 లక్షలకు పైగా సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇతను ఇదే విధంగా మహిళలను పరిచయం చేసుకుని వారికి మత్తు మాత్రలు ఇచ్చి గతంలో తిరుపతి, విజయవాడ, ఏలూరు, నంద్యాల తదితర ప్రాంతాల్లో ఈ కూడా ఈ విధమైన దొంగతనాలు చేసినట్లు సీఐ చెప్పారు. ఇటీవల విజయవాడలో ఓ కేసులో రిమాండ్‌కు కూడా వెళ్ళినట్లు సిఐ తెలిపారు. ఈ కేసు ఛేదనలో కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. సమావేశంలో ఎస్‌ఐలు పి సురేష్, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.కేసులో రిమాండ్‌కు వెళ్ళినట్లు సీఐ పేర్కొన్నారు. ఇతన్ని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పరచనున్నట్లు తెలిపారు.


అపరిచితులను నమ్మొద్దు: సీఐ

గుర్తు తెలియని వ్యక్తులు మాయ మాటలు చెప్పి దొంగతనాలకు పాల్పడుతున్నారని, అలాంటి అపరిచితుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దనిటూ టౌన్ సిఐ సోమశేఖర్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లలో కానీ, 100కు కానీ సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అపరిచితులకు దూరంగా ఉండాలని అన్నారు.

అద్దంకిలో మాదకద్రవ్యాల కలకలం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా గురువారం ఓ యువకుడు పడిపోయి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే 108 వాహనానికి సమాచారం అందించగా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సమయంలో ఆ యువకుడి వద్ద జేబులో తెల్లటి పదార్థాన్ని గుర్తించారు. దానిని మత్తు పదార్థంగా అనుమానిస్తున్నారు. యువకుడు పట్టణానికి చెందిన పోతులూరి విజయబాబుగా గుర్తించారు. వీరు రామా టాకీస్ పక్క బజార్లో నివాసం ఉంటున్నారు. యువకుడు ఉపయోగించిన పదార్థంపై ఏమిటనే అంశంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.



కిందపడిపోయిన యువకుడు



పిచికారీ విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముంపు గ్రామాల్లో గ్రామసభలు

ప్రజాశక్తి-అద్దంకి

గుండ్లకమ్మ రిజర్వాయర్ ముంపు గ్రామాలలో నిర్వహిస్తున్న గ్రామసభలలో భాగంగా గురువారం అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామంలో ప్రాజెక్టు అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ నాయకులు పలు సమస్యలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఉమాదేవి దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. గ్రామంలోని ఎస్సీ కాలనీలు, కొండకింద కొండపైన, మాలపల్లి వారికి నేటికీ ఇళ్ల స్థలాల కేటాయింపులు జరపలేదని అన్నారు. ప్రభుత్వం వారు 2006 ఎస్ఇసి గణన ప్రకారం కొంతమందికి ఇళ్ల స్థలాల కేటాయింపులు జరిపారని అన్నారు. మేజర్లందరికీ ఇళ్ల స్థలాలు ఖచ్చితంగా కేటాయించాలని కోరారు. ఆర్అండ్ఆర్ పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు (సి.సి రోడ్లు, పాఠశాల, విద్యుత్ ఆరోగ్య కేంద్రం) లేవని పేర్కొన్నారు. పునరావాస కాలనీలో ప్రభుత్వం నిర్మించి ఇస్తామన్న మసీదు నిర్మాణం పనులు నేటికీ ప్రారంభించలేదన్నారు. పునరావాస కాలనీకు సామాజిక వర్గాల వారీగా శ్మశాన స్థలాలు కేటాయింపు చేయలేదన్నారు. ప్రభుత్వమే ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, ప్రస్తుతం 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ముంపు గ్రామంలో నివసిస్తున్న తమకు పునరావాస కాలనీలో ఇళ్ళు నిర్మించి గృహ ప్రవేశాలు జరిగేవరకూ అన్ని వసతులు (విద్యుత్ కనెక్షన్లు, రోడ్డు మరమ్మతులు, తాగునీరు) కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

అమరజీవి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని ఆర్యవైశ్య నాయకులు చిన్ని పూర్ణారావు, దోగిపర్తి అయ్యప్ప పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక విష్ణాలయం ఆవరణలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోట సందీప్, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.



మహిళలతో సమావేశం అయిన అధికారులు

పురుగుమందు పిచికారీ విధానంపై అవగాహన

ప్రజాశక్తి-అద్దంకి: ఆధునిక యంత్ర పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించుకోవాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని బొమ్మనంపాడులో డ్రోన్తో పురుగుమందు పిచికారీ విధానంపై రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. తక్కువ నీటితో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం 40 శాతం రాయితీపై మండలానికి 3 డ్రోన్లు కేటాయించిందని తెలిపారు. మొక్కజొన్న పైరు పెరిగిన తరువాత మందు పిచికారీ చేయటానికి చాలా అనుకూలంగా ఉందని పేర్కొన్నారు.

హెల్త్ క్లినిక్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు మండలంలోని నక్కలపాలెం గ్రామంలో హెల్త్ క్లినిక్ భవనానికి జడ్‌పిటిసి మాజీ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధికి ఈ హెల్త్ క్లినిక్ దోహద పడుతుందని, త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ వేణుబాబు, మాజీ సర్పంచ్ చిలుకూరి శ్రీనివాసరావు, ఎలీషా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న భవనం శ్రీనివాసరెడ్డి

21న మహిళా మార్ట్ ప్రారంభం: పీడీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా టంగుటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను ప్రారంభిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ బాబూరావు తెలిపారు. శింగరాయకొండ మండలంలో గురువారం పీడీ పర్యటించారు. తొలుత శింగరాయకొండ ఎపిఎం ఆదిశేషు, జరుగుమల్లి ఎపిఎం భాగ్యలక్ష్మితో సమావేశం నిర్వహించారు. 21న టంగుటూరులో మహిళా మార్ట్ ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం గ్రామ సంఘం సమావేశంలో పీడీ బాబూరావు పాల్గొని బాబూరావు మహిళలతో మాట్లాడారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి-పర్చూరు: మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను పర్చూరు వైఆర్ హైస్కూలులో జడ్పీటీసీ సభ్యురాలు కొల్లా గంగాభవాని గురువారం ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో పర్చూరు మండలంలో ఉన్నత పాఠశాలలు, యుపి పాఠశాలల విద్యార్థులు 60 ప్రాజెక్టులు ప్రదర్శనకు తీసుకువచ్చారు. న్యాయనిర్ణేతలుగా జూనియర్ కళాశాల అధ్యాపకులు సత్యప్రకాష్, సురేంద్రబాబు వ్యవహరించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షురాలు మేకా ఆనందకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక వికాసానికి కొత్త ఆలోచనా విధానాలు రేకెత్తించటానికి ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. డిప్యూటీ డిఇఒ ఎ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు దేశ భవిష్యత్తుకు దోహదపడతాయని అన్నారు. సిహెచ్ రిషిత, గురుకుల పాఠశాల నాగులపాలెం, ఎం అజయ్, జడ్పీ హైస్కూలు చెరుకూరు, ఎం యోహోషువా, వైఆర్ హైస్కూలు పర్చూరు, పి వినీల, జడ్పీ హైస్కూలు అడుసుమల్లి, ఎం కళ్యాణి, జడ్పీ హైస్కూలు ఉప్పుటూరు, జి అభినయ్ యశ్వంత్, జడ్పీ హైస్కూలు అన్నంభొట్లవారిపాలెం విద్యార్థులు వరుసగా బహుమతులు పొందారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొల్లా గంగా భవాని, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కోట ప్రసన్న, మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు, నోడల్ అధికారి ఎంవి సుబ్బారావు, ఎంపిడిఒ జి లక్ష్మీదేవి, ఈదర రాజశేఖర్, ఎల్ శ్రీనివాసరావు, దేవేంద్రరావు, కొల్లా సుభాష్‌బాబు, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పర్చూరులో ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

ప్రతిభను వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శన

- డిప్యూటీ డిఈఓ కిరణ్ కుమార్

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు విద్యాశాఖ ఏటా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహిస్తుందని పర్చూరు విద్యా డివిజన్ ఉప విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్ అన్నారు. జిల్లా స్థాయి ప్రదర్శనను నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమవుతున్న వేళ దానికి సన్నాహకంగా పేరాల ఆంధ్ర రత్న పురపాలకోన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. దీనిని మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఉప విద్యాశాఖాధికారి విచ్చేసి విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెట్టి కొత్త కొత్త ఆవిష్కరణలను



వైజ్ఞానిక ప్రదర్శన పరిశీలిస్తున్న డిప్యూటీ డిఈఓ కిరణ్ కుమార్

రూపొందించాల్సి ఉంటుందన్నారు. రెండేళ్లుగా ఆన్‌లైన్ ద్వారానే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించగా ఈ సంవత్సరం ప్రత్యక్షంగా ప్రదర్శనను నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. పర్యావరణం, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణానికి సంబంధించిన అంశాలు, గణితం, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీలో ప్రగతి, ప్రస్తుత ఆవిష్కరణలు అనే అంశాలలో ప్రాజెక్టులు రూపొందించారు. మండలంలో మొత్తం 10 ఉన్నత పాఠశాలల నుంచి 43 ప్రదర్శనలు వచ్చినట్లు మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలుగా గౌతమి కళాశాల అధ్యాపకులు భరత్, వసాశ్రీరావు, ఎం శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్, జిల్లా సైన్స్ సమన్వయకర్త పవని భానుచంద్రమూర్తి, సైన్సు ఉపాధ్యాయులు కౌతరపు రాజేంద్రప్రసాద్, గాంధీ, శ్రీనివాస్, యలమ ఉమామహేశ్వరరావు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో రైతుల మనుగడ ప్రశ్నార్థకం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

వైసిపి ప్రభుత్వంలో రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని మాండూస్ తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పొగాకు, వరిపంట పొలాలను గురువారం పేరాయపాలెంలో రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎకరాకు రూ.60 వేల చొప్పున పొగాకు సాగు చేశారని, అయితే తుఫాను ప్రభావంతో పూర్తిస్థాయిలో పంట నీటమునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు లక్ష ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. 30 శాతం విపత్తుల వల్ల దెబ్బతింటే 70 శాతం రాష్ట్ర ప్రభుత్వం అవగాహన లేమితో రైతాంగం నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను,



పారాయపాలెం గ్రామ పరిసర ప్రాంతంలో దెబ్బతిన్న పొగతోటలను పరిశీలిస్తున్న శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

తీసుకోవాల్సిన చర్యలపై ఈరోజు ఉదయం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పొగాకు బోర్డు వారికి ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలమంతా కలిసి వివరించినట్లు తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రాష్ట్ర ప్రభుత్వం 20 వేల రూపాయలు, బోర్డు నుంచి 20 వేల రూపాయలు నష్టపరిహారంగా తక్షణమే ఇవ్వాలని కోరారు. అదేవిధంగా బ్యారన్‌కు 50 వేల రూపాయలు అడ్వాన్స్‌గా ఇచ్చి పొగాకు కొనుగోళ్ల సమయంలో రికవరీ చేసేలా చూడాలని సూచించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వచ్చే సంవత్సరం నుంచయినా పొగాకు పంటకు ఇన్సూరెన్స్ ఉండేలా చూడాలని కోరారు. మాండూస్ తుఫాన్ దాటికి లక్ష ఎకరాలకు పైగా మునిగిపోయి రైతులు ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నుంచి ఏ మంత్రి కూడా క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు మనోధైర్యం కల్పించకపోవడం సిగ్గుచేటని అన్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు విస్తృతంగా పర్యటించి పూర్తిస్థాయిలో గణన చేపట్టి పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఎటువంటి ఆంక్షలు లేకుండా నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ డిమాండ్ చేశారు.



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డిఒ పార్థసారథి

ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రేపల్లె

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బేతపూడి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా సచివాలయ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు సచివాలయానికి వచ్చి తమకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి వీలైనంత తొందరగా ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలను సచివాలయం చుట్టూ తిప్పుకునేలా సిబ్బంది చేయరాదని సూచించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి సమయానికి కార్యాలయానికి రావాలని ఆదేశించారు. సచివాలయంలోని రికార్డులు పరిశీలించి సిబ్బంది హాజరును తనిఖీలు చేశారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్నెస్ కేంద్రాల నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను సద్వినియోగం చేసుకొని కొలత వేసేందుకు సహకరించాలని కోరారు. పంట కోత పూర్తయిన రైతులు రైతు భరోసా కేంద్రాల ధాన్యం విక్రయించినట్లయితే ప్రభుత్వం తరపున మంచి సబ్సిడీతో మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపల్లె డిటిగా సత్యనారాయణ

ప్రజాశక్తి-రేపల్లె



రేపల్లె మండలం డిప్యూటీ తహసీల్దారుగా ఎన్ సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు పదోన్నతులు కల్పిస్తూ డిప్యూటీ తహశీల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో రేపల్లె పట్టణ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ పదోన్నతిపై డిప్యూటీ తహశీల్దారుగా రేపల్లె మండల కార్యాలయంలో నియమితులయ్యారు. పట్టణ ఆర్‌ఐగా గంగటిపాలెం వీఆర్వోగా పని చేస్తున్న పెదలంక రాంబాబు ఉద్యోగోన్నతిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఏలు, వీఆర్వోలు అభినందించారు.



కలశాలను తరలిస్తున్న నాయకులు

వైభవంగా నగరోత్సవం

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక సాక్షిరామలింగేశ్వరస్వామి దేవస్థాన చైర్మన్ సూది వెంకటరావు ఆధ్వర్యంలో భవాని స్వాముల పర్యవేక్షణలో 32వ భవాని నగరోత్సవం గురువారం నిర్వహించారు. తొలుత స్థానిక హరిహరక్షేత్రం నుంచి సాక్షిరామలింగేశ్వరస్వామి దేవస్థానం వరకూ 516 మంది మహిళలతో భారీ కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బూచేపల్లి ట్రస్టు ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. మంత్రి శిద్దా రాఘవరావు ఆధ్వర్యంలో దేవస్థానాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలలో అలంకరించారు. ఈ కార్యక్రమంలో శిద్దా నాగేశ్వరరావు సహకరించారు. దేవస్థానం చైర్మన్ సూది వెంకటరావు, మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారంవెంకారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కె సుబ్రహ్మణ్యం, శేషారెడ్డి, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, యలమంద పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అడుగడుగునా ప్రజానీరాజనాలు అందుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లూరు సౌత్‌లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజలను సంక్షేమ దిశగా అడుగులు వేసేవిధంగా జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రజల చెంతకే పాలన, ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు, ప్రతి నెల 1వ తేదీ ఉదయం కల్లా ప్రతి అవ్వా తాతకు వారి ఇంటి ముగింటకే పెన్షన్ అందిస్తున్నారని అన్నారు. అంతేకాకుండా చిరు వ్యాపారులకు చేదోడుగా నిలుస్తున్నారన్నారు. విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందించి జగన్ చిన్నారులకు మేనమామగా అండగా ఉంటున్నారన్నారు. స్వర్ణయుగాన్ని తలపించేలా పాలన చేస్తూ రాష్ట్రంలో ఇంకా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు స్వయంగా ప్రజలను ప్రజాప్రతినిధులు వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రజలు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధివివరాలను స్వయంగా వారే తెలుపుతుంటే ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, గ్రామ సర్పంచ్ కోన శ్రీనివాసరావు, కైతేపల్లి సర్పంచ్ మండలి అంజయ్య, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజిళ్లపల్లి పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని నూజిళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం మండల స్పెషల్ ఆఫీసర్, కేఐ సుదర్శన్ రాజు తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలవుతున్న తీరును పరిశీలించారు. ఆయన కూడా మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలోనే ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చందలూరు గ్రామ పంచాయతీ



మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ రాజు

సెక్రెటరీ రాజేష్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-బల్లికురవ

ఈ నెల 16-17 తేదీలలో చీరాలలో జరుగు సిఐటియు బాపట్ల జిల్లా మొదటి మహా సభలను జయప్రదం చేయాలని సిఐటియు బాపట్ల జిల్లా నాయకులు బత్తుల హనుమంత రావు కోరారు. గురువారం బల్లికురవలో జరిగిన స్కీం వర్కర్ల సదస్సులో పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని తెలియజేశారు. స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం భోజనం కార్మికులు, వెలుగు యానిమేటర్, వివోఏలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక కర్షకులు ఐక్యమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని తెలియజేశారు. స్కీం వర్కర్లపై అధికారులు, రాజకీయ నాయకులు



సదస్సులో మాట్లాడుతున్న హనుమంతరావు

వేధింపులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో స్కీం వర్కర్లందర్నీ ఏకంచేసి ఐక్య పోరాటాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం బల్లికురవ మండల సిఐటియు కన్వీనింగ్ కమిటీని ఏడుగురితో ఏర్పాటు చేసినట్లు కోరారు. కన్వీనర్‌గా ఏజి వరలక్ష్మిని కో కన్వీనర్‌గా జి నాగమణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా, మిడ్ డే మీల్స్ నుంచి స్కీం వర్కర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం: ఎస్‌పి

ఎస్పీ ఛాంబర్, సమావేశం హాలు ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఇందుకు పోలీస్ శాఖకు అవసరమైన కనీస సౌకర్యాలను ఒకదాని తరువాత మరొకటిగా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాపట్ల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న భవనాన్ని కేటాయించగా సదరు భవనంలో ఎస్పీ కార్యాలయం, నివాస భవనానికి తగిన విధంగా పునర్ నిర్మాణం చేశారు. గురువారం ఎస్పీ చాంబర్‌ను, సమావేశం హాలును జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గతంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ సిబ్బందికి అవసరమైన ఏఆర్ కార్యాలయాన్ని, కవాతు మైదానాన్ని ఏర్పాటు చేశామని, మినిరల్ వాటర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లాలో నేరాలు నియంత్రించేందుకు నేర ఛేదనలో నైపుణ్యం గల పోలీస్



ఎస్పీ క్యాంప్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

అధికారులు, సిబ్బందితో జిల్లా సెంట్రల్ క్రైమ్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారికి వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ దగ్గరలో నిరుపయోగంగా ఉన్న పోలీస్ క్వార్టర్స్‌ను పునర్నిర్మించి దానిలో బాపట్ల జిల్లా సెంట్రల్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేసి ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా సమావేశం నిర్వహించుకునేందుకు సమావేశపు హాలు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీ క్యాంపు కార్యాలయానికి కేటాయించిన బాపట్ల అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలోని భవనంలోనే సమావేశపు హాలును నూతనంగా నిర్మించి ఈ రోజు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లు ఏ శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, టి మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్ కుమార్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం మురళీకృష్ణ, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్ మన్మథరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ బి శ్రీకాంత్‌నాయక్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు, కౌలు రైతులను ఆదుకోండి

జేసీని కోరిన సిపిఎం ప్రతినిధులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరుతూ సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్‌కు సిపిఎం ప్రతినిధులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రతినిధులు మాటల్లాడుతూ ఇటీవల వచ్చిన తుఫాన్ ప్రభావంతో జిల్లా అంతటా అధిక వర్షాలు కురిసాయని తెలిపారు. దీంతో పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తాయన్నారు. మినుము, పెసలు, అలసంద, వరి వంట లాంటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కంది, జొన్న, ఆముదాలు, వేరుశనగ పైర్లకు కూడా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. శనగ, పొగాకు, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం జరిగినట్లు తెలిపారు. కోట్లాది రూపాయలు రాబడి వర్షాల పాలైనట్లు పేర్కొన్నారు.



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం ప్రతినిధులు

ఫలితంగా రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేయబడుతున్నారన్నారు. పంట నష్టం కారణంగా నష్టపోయిన రైతులు, కౌలురైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ క్రాప్ నమోదులో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. పంట నష్టం నమోదులో జరుగుతున్న అవకతవకలపై పంట నష్టపోయిన వాస్తవ రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి అవసరమైన నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వర్షానికి దెబ్బతిన్న అన్ని రకాల పంటలు, అందరూ రైతుల పేర్లు నమోదు చేసే విధంగా ఎన్యుమరేషన్ జరగాలన్నారు. సాగులో ఉన్న కౌలురైతుందరినీ నమోదు చేసి నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, ఫసల్ బీమా యోజన మొత్తం పంటనష్టం స్థాయిలో ఉండాలన్నారు. పంట నష్టపోయిన రైతులు తిరిగి పంట వేయడానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై సరఫరా చేయాలని కోరారు. ఈ క్రాప్ నమోదు, ఎన్యుమరేషన్‌లో అవకతవకలను అరికట్టాలన్నారు. జేసీని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బి రఘురాం, జి రమేష్ ఉన్నారు.

చెత్తను వేరుచేసి ఇవ్వాలి

నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజలు తమ ఇళ్లలోని తడి, పొడి, హానికార చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఈనెల 12 నుంచి 18 వరకూ క్లీన్ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా కబాడిపాలెం, క్లౌపేట సచివాలయాల పరిధిలో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. తడి,పొడిచెత్తను వేరు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి ముద్రించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా దాన్ని తిరిగి వివిధ రూపాల్లో వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. తడిచెత్తను ఎరువుగా మార్చి రైతులు అందజేయనున్నట్లు తెలిపారు. పొడిచెత్తను గుంటూరులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గుత్తికొండవారిపాలెంలో నిర్మిస్తున్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను కూడా త్వరలో వినియోగంలోకి తీసుకు రానున్నట్లు తెలిపారు. ఆప్లాంట్ ద్వారా మురుగునీటిని శుభ్రం చేసి రైతుల పొలాలకు అందిస్తామని వివరించారు. చెత్తను ఇళ్లలోనే వేరు చేసే విధానం గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. యూజర్ చార్జీల వసూలు గురించి సచివాలయ సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ సి.మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్. పిచ్చయ్య, విశ్రాంత అసిస్టెంట్ కమిషనర్ బ్రహ్మయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



రైతులకు పరిహారమిచ్చి ఆదుకోండి

పొగాకు బోర్డు ఈడీకి టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలతో పొగాకు పంట ధ్వంసం అయిందని, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీధర్‌బాబును ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి నేతలు కోరారు. స్థానిక పొగాకు బోర్డు ఆర్ఎం కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పాత్రికేయులతో మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పొగాకు పంట పూర్తిగా ధ్వంసమైనదని తెలిపారు. .దేశంలోనే అత్యధికంగా ప్రకాశం జిల్లాలో పొగాకు పంటను సాగు చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 47,652 హెక్టార్లలో పొగాకు పంట సాగవుతున్నట్లు తెలిపారు. 75శాతం పంటలు నీట మునిగి పంట మొత్తం దెబ్బ తిన్నాయన్నారు. రైతులు ఎకరానికి రూ.25వేల నుంచి 70వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు, పొగాకు బోర్డు రూ.20 వేలు కలిపి మొత్తం 40 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యారన్‌కు రూ.50వేలు అడ్వాన్స్‌గా వడ్డీ లేని రుణం అందజేసి పొగాకు అమ్మకం సమయంలో వసూలు చేసేలా రైతులకు చేయుత నందించాలన్నారు. మిర్చి రైతులు ఎకరానికి లక్ష వరకు పెట్టుబడి పెట్టారని తెలిపారు. వరి, మినుములు పంటలు దెబ్బ తిన్నాయన్నారు. పంటలు దెబ్బతిన్ని నష్టపోయిన రైతులు బ్యాంకు రుణాలను రీ షెడ్యూలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధనరావు, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, టిడిపి సంయుక్త కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయకుమార్, పోలవరపు సీతారామయ్య, తమ్మిశెట్టి రమాదేవి, కసుకుర్తి అంకరాజు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఇటీవల కురిసిన వర్షాలకు మార్కాపురం డివిజన్ పరిధిలోని 13 మండలలో పత్తి, మిర్చి, వరి, మినుము, బొబ్బర్లు, పప్పు శనగ, ఆముదాలు, కంది, పొగాకు పంటలకు భారీగా నష్టం వాటిల్లినట్లు ఎపి రైతు సంఘం నాయకులు తెలిపారు. బాధిత రైతులకు నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు సంఘం పశ్చిమ ప్రకాశం జిల్లా కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. అయితే అధికారులు మొక్కుబడిగా పంట నష్ట ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ నివేదికలో పత్తి పదివేల ఎకరాలు, మిర్చి 23 వేల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా పత్తి పంటకు కేవలం 553 ఎకరాలు నష్టం వాటిల్లినట్లు అధికారులు చూపుటం దారుణమని తెలిపారు.అనంతరం సబ్ కార్యాలయ తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య, రైతు సంఘం నాయకులు ఏరువా పాపిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి ,వెంకటేశ్వరరెడ్డి, షేక్ హుస్సేన్, దూదేకుల మహబూబ్ బాషా, జె.సుబ్బయ్య, ఎస్.బాలచెన్నయ్య పాల్గొన్నారు.



తహశీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆశా వర్కర్ల ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

సిఐటియు మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కురిచేడు

మండలంలో ఖాళీగా ఉన్న ఆశా వర్కర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సిఐటియు మండల గౌరవాధ్యక్షుడు సందు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. కురిచేడు పిహెచ్‌సి వద్ద ఆషా వర్కర్ల మండల రెండో మహాసభ యు.కొండమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించిన కారణంగానే ఆశా వర్కర్ల వేతనం రూ.150 నుంచి రూ. 10,000 సాధించినట్లు తెలిపారు. ఆశా వర్కర్లకు రిటైర్డ్‌మెంట్ బెన్ ఫిట్స్, పెన్షను, ప్రమాద బీమా తదితర సమస్యలు పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాలన్నారు. తొలుత మరణించిన ఆశావర్కర్లకు మహాసభ జోహార్లు అర్పించింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షు రాలిగా యు.కొండమ్మ, కార్యదర్శిగా వై.యోగేశ్వరమ్మ, సహాయ కార్య దర్శులుగా యు.నాగేంద్రం, పి.మరియ సుశీల, ఉపాధ్యక్షులుగా ఎన్. లక్ష్మి, జి.క్రపమ్మ, కోశాధికారిగా ఎం. నాగమల్లేశ్వరి, కమిటీ సభ్యులుగా వి. అరుణ, ఎస్.సుగుణకుమారి,లక్ష్మి, ఎస్‌కె.మాబుల్లా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న సందు వెంకటేశ్వరరావు



కానిస్టేబుల్‌కు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్‌పి

పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

జరుగుమల్లి : వార్షిక తనిఖీలో భాగంగా జరుగుమల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి మల్లిక గర్గ్ గురువారం తనిఖీ చేశారు. తొలుత పోలీసు సిబ్బంది నుంచి ఎస్‌పి గౌవర వందనాన్ని స్వీకరించారు. పోలీసు సిబ్బంది ఎస్‌పి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌పి స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాల గురించి ఆరా తీశారు. అనంతరం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎం.నిడమనూరు వాగులో గల్లంతు అయిన మారెళ్ళ రమణయ్యను కాపాడిన టంగుటూరు కానిస్టేబుల్ డి.రాజవెంకటేశ్వర్లును ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజు, శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ ఖాదర్‌బాషా, శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజ్ ఫాతిమా, జరుగుమల్లి ఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ పిపి శ్రీనివాసరెడ్డి మృతికి సిపిఎం నేతల సంతాపం

ఒంగోలు కలెక్టరేట్ : మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్రముఖ న్యాయవాది డి.శ్రీనివాసరెడ్డి మతికి సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ సంతాపం ప్రకటించింది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. శ్రీనివాసరెడ్డి భౌతిక కాయాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీనివాస రెడ్డి సుదీర్ఘకాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారని తెలిపారు. జిల్లా కోర్టులో ప్రముఖ న్యాయవాదిగా ఉన్నారన్నారు. ప్రజల ఉమ్మడి సమస్యలు, కార్మిక సమస్యల పట్ల సరియైన అవగాహనతో వారికి చట్టపరంగా న్యాయం దక్కేలా చేయడంలో ఆయన మంచి పాత్ర నిర్వహించారన్నారు. నివాళులర్పించిన వారిలో మంగమ్మ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ ఎవి. పుల్లారావు, సిఐటియు ఒంగోలు నగర అధ్యక్షుడు దామా శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్. బాబు ఉన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-పిసిపల్లి

రాష్ట్ర స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలకు మండల పరిధిలోని గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంవి.శివకుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన బి.షణ్ముఖరెడ్డి, ఎస్.లక్ష్మీమాధురి అండర్-17 పోటీలకు, కె.లక్ష్మీపవిత్ర అండర్-14 రాష్ట్ర స్థాయి షటిల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎంవి.శివకుమార్, పీడీ సుజాత,ఉపాధ్యాయులు అభినందించారు.

గోపురాల నిర్మాణ పనులు ప్రారంభం

మార్కాపురం : మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం రూపురేఖలు మారనున్నాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, ధర్మకర్తల సహకారంతో ఆలయానికి నాలుగు దిక్కులా నాలుగు గోపురాలను రూ. 5.5 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు కృషి చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి రూ. 2 కోట్లు మంజూరు కాగా.... మిగిలిన పైకం దాతల సహకారం తీసుకున్నారు. ఆలయ గోపురాల పనులను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డితో పాటు ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగాలు వెలకట్టలేనివి

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అమర జీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు వెలకట్టలేవని మాజీ మంత్రి, వైసిపి నాయకులు శిద్దా రాఘవరావు తెలిపారు. పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఆవరణలోని శ్రీరాముల విగ్రహానికి బిఎంసి సభ్యులతో కలిసి శిద్దా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఐక్యత కోసం ప్రాణ త్యాగం చేసి అమరులైన పొట్టి శ్రీరాముల త్యాగం మర్చిపోలేనిదన్నారు. బాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాడిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్ అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కందేపి ప్రభాకర రావు, ఇలింద్ర సత్య శ్రీనివాసరావు, బియ్యపు వరద రాజాం, పల్లపోతు శ్రీనివాసరావు, కూరపాటి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు కనమర్లపూడి హరిప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్ : అమరజీవి పొట్టిశ్రీరాముల వర్ధంతి సందర్భంగా వైసిపి జిల్లా కార్యాలయంలో శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్, సూపర్ బజార్ చైర్మన్ తాతా బదరీ, మాజీ చైర్మన్ ప్రసాద్, నాయకులు పసుపులేటి శ్రీను, వర్ల శేషయ్య, తోటపల్లి సోమశేఖర్, భీమేష్, బైరెడ్డి అరుణ పాల్గొన్నారు.

తర్లుపాడు : ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కశ్శెట్టి.జగన్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాముల 70వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి, సుబ్బారెడ్డి, సర్పంచి పల్లెపోగు వరాలు, తాడివారిపల్లి ఎస్ఐ ముక్కంటి, తర్లుపాడు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కశ్శెట్టి జగన్, సెక్రటరీ జవ్వాజి జనార్ధన్‌రావు, ట్రెజరర్ తుమ్మలపెంట సురేష్, వైసిపి మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ అచ్యుతరావు, ఎపిఎం పిచ్చయ్య, ఎపిజివి మేనేజర్ రామకృష్ణ, మల్లికార్జునరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, చెన్నకిషోర్, పవన్,ఆంజనేయులు, నెహ్రూ యూత్ గౌరవాధ్యక్షుడు పుల్లయ్య, వెంకట రమణ, నీలకంఠేశ్వరరావు,కృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాముల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్

మార్కాపురం : పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయి పటేల్ వర్ధంతి సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షతన వల్లభాయి పటేల్, పొట్టి శ్రీరాముల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జునరావు మాట్లాడుతూ సర్దార్‌వల్లభాయి పటేల్ స్వాతంత్ర్యం కోసం పనిచేశారన్నారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి తర్లుపాడు మండల కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, టిడిపి ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర నాయకులు డి.మస్తానయ్య, పిన్నిక మల్లికార్జున పాల్గొన్నారు.

ఎద్దానపూడి : స్థానిక శాఖా గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముల చిత్రపటానికి గ్రంథపాలకుడు దొండపాటి వెంకటసుబ్బారెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పిసిపల్లి : మండల పరిధిలోని పడమటిపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాముల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు కాకర్ల చిన్నకొండల రావు, వై.బ్రహ్మయ్య, సాతులూరి వెంకటరావువులు, నీలిశెట్టి సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు

పెద్దదోర్నాల : గ్రంథపాలకుడు వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రమాదేవి, యోహాన్, నాయకులు వెంకటేశ్వర్లరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో...

స్థానిక కన్యాక పరమేశ్వరి దేవాలయం వద్ద ఉన్న పొట్టి



శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా

శ్రీరాముల విగ్రహాని టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, ఈదర మల్లయ్య, శ్రీనివాస్ యాదవ్, కొప్పుల సుబ్బారెడ్డి, ఆర్.సుబ్బరత్నం, బాషా తదితరులు పాల్గొన్నారు.

పామూరు : పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా టిడిపి నాయకులు ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు. అభిమానులు, మహిళా నాయకులు, ఐటిడిపి కో ఆర్డినేటర్లు, బూత్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

దర్శి : అమర జీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు సంగా తిరుపతిరావు, శ్రీను పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్ళూరు మండలపరిషత్ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు మరియు వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు ఎంపిపి తాటికొండ శ్రీనివాసరావు, జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ యుగకీర్తి, ఎంఇఒ సుబ్బయ్య, నాయకులు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొరిగొర్ల ఉషామురళి, సర్పంచి కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి, వైస్ ఎంపిపి వడ్లమూడి వెంకటేశ్వర్లు, మిట్టా కోటిరెడ్డి, జడ్‌పిటిసి మురికిపూడి సుధాకర్,కందుల నారపురెడ్డి, గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, ఉప సర్పంచి ఇమ్రాన్‌ఖాన్, ఎంపిడిఒ వసంతరావునాయక్, ఎపిఎం జి.వెంకటేశ్వర్లు, ఎపిఒ టి.దేవయ్య పాల్గొన్నారు.

ప్రత్యూషకు పిహెచ్‌డి పట్టా

జరుగుమల్లి : మండల పరిధిలోని పచ్చవ గ్రామానికి చెందిన తాటిపర్తి ప్రత్యూష నాగార్జున యూనివర్సిటీ నుంచి పిహెచ్‌డి పట్టా అందుకుంది. ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి చేతుల మీదుగా ప్రత్యూష ఈ పట్టాను అందుకున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ప్రత్యూష 1 నుంచి 7 వ తరగతి వరకూ మండల పరిధిలోని రెడ్డిపాలెం గ్రామంలో చదివింది. 8 వ తరగతి నుంచి పచ్చవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివింది. గుంటూరులోని నాగార్జు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఎ ఇంగ్లీష్ పూర్తిచేసింది. అక్కడే పిహెచ్‌డి చేసి పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యూషను ఆమె తల్లి తండ్రులు భాస్కరరావు, అరుణకుమారి, గ్రామస్తులు అభినందించారు.

128 మందికి వైద్యపరీక్షలు

జరుగుమల్లి : మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో ఒంగోలు కిమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో 128 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అందులో 45 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 35 మందికి ఇసిజి తీశారు. బిపి, షుగర్ రోగులను పరిశీలించి మందులు అందజేశారు.

17న పెన్షనర్ల దినోత్సవం

పొదిలి : ఈ నెల 17న పెన్షనర్ల సంఘ కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పొదిలి ఎస్‌టిఒ బి. చంద్రశేఖర్ రావు, మాజీ ఎస్‌టిఒ ఎవిఎస్ఎస్ ప్రసాద్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాల నిండిన పెన్షనర్లను సన్మానించనున్నట్లు వారు పేర్కొన్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

పిసిపల్లి : మండల పరిధిలోని గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తురకపల్లి గ్రామానికి చెందిన కాంచాని మనోజ్, 10వ తరగతి చదువుతున్న కాంచాని మానస తండ్రి చనిపోయాయి. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ తమ గ్రామం నుంచి 3 కిలో మీటర్ల నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన ఉపాధ్యాయులారు వాణి భరోసా ఫౌండేషన్ సహకారంతో రూ.6 వేల విలువైన సైకిల్‌ను మానసకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మానస కుటుంబ సభ్యులుచ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు భరోసా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వైసిపిని తరిమి కొట్టాలి : టిడిపి

పామూరు : రాష్ట్రంలో దౌర్జన్య పాలన సాగిస్తున్న టిడిపిని తరిమికొట్టాలని టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి హెచ్చరించారు. పట్టణంలోని 15,16 వార్డులలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన ఎన్నోరోజులు కొనసాగదని తెలిపారు. ప్రజలు రాబోయే ఎన్నికలలో ఓట్లతో బుద్ధి చెప్పుతారన్నారు. ఎవరైనా అవినీతిని ప్రశ్నిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ రహంతుల్లా, అడుసుమల్లి ప్రభాకర్, ఇర్రి కోటిరెడ్డి, మాల్యాద్రి, రఫీ, ఖాదర్‌బాష, గౌస్‌బాష, డోలా శేషు, ఎం. రమణయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు ప్రసాద్ హెచ్చరించారు. కొండారు నేషనల్ హైవే రోడ్డు ప్రక్కన కొత్తచెరువును చదును చేసి ఫెన్సింగ్ చేశారు.ఈ విషయం గురించి సమాచారం అందుకున్న తహశీల్దారు తన సిబ్బందితో కలిసి వెళ్లి ఫెన్సింగ్‌ను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో విఆర్ఒ రఫీ, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపిపి,జడ్‌పిటిసి ఆగ్రహం

ప్రజాశక్తి-వెలిగండ్ల



మాట్లాడుతున్న జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి


మండలాభివృద్ధి కోసం మూడు నెలలకోక సారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కాకపోవడం పట్ల ఎంపిపి రామన మహాలక్ష్మి, జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిపి రామన మహాలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి, జడ్‌పిటిసి మాట్లాడుతూ మండలంలో జరిగే పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చ జరగాల్సి ఉండగా అధికారులు హాజరు కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు భారీ పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలపారు. ప్రతి రైతుకు న్యాయం జరిగేలా వ్యవసాయశాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు సంజాయిషీ నోటీసులు జారీ చేయాలని ఎంపిడిఒ తాతపూడి సుకుమార్‌ను ఎంపిపి, జడ్‌పిటిసి ఆదేశించారు. ఎఒ రంగకృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులు 5వేల ఎకరాల్లో మినుము పంట సాగు చేసినట్లు తెలిపారు. అందులో 4,500 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ఎన్యూమరేషన్‌లో ఈ క్రాప్ నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు తాతపూడి మేరిపుష్ప, వై.భారతి, సింగిల్‌విండో అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ మెంబర్ షేక్ అమీద్, ఎంపిడిఒ తాతపూడి సుకుమార్, ఎపిఎం లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పవన్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన 'ఉడుముల'

పొదిలి : ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు, టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన స్వగృహంలో కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లా రాజకీయాలపై చర్చించారు. కార్యక్రమంలో కెకెమిట్ల మాజీ ఎంపిపి రామనారాయణరెడ్డి, కొనకనమిట్ల మండల వైసిపి కన్వీనర్ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్



మాట్లాడుతూన్న సిఐ భీమానాయక్

గంజాయి విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పట్టణ సిఐ ఎం. భీమానాయక్ హెచ్చరించారు. పట్టణ పరిధిలోని పూల సుబ్బయ్య కాలనీ, బాపూజీ కాలనీ, ఎరుకల కాలనీల్లో ఎస్ఇబి, పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ భీమానాయక్ మాట్లాడుతూ ఎస్‌పి మల్లిక గర్గ్, ఎస్ఇబి జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర రావు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి అమ్మినా, మొక్కలు సాగు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈతనిఖీల్లో ఎస్ఇబి సిఐ రాఘవాయి, ఎస్ఐ పద్మజ, పట్టణ ఎస్ఐ ఎ.శశికుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు

ప్రజాశక్తి-అద్దంకి

అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా అద్దంకి మెయిన్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహానికి విగ్రహ కమిటీ అధ్యక్షులు పోకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్ కోట శ్రీనివాస్ కుమార్, అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కూరపాటి రామకోటేశ్వరావు, అద్దంకి ఆర్యవైశ్య ప్రముఖులు గార్లపాటి శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరావు, ఉడతు సురేష్, కోటేశ్వరరావు, అత్తులూరి హనుమంతరావు, చామర్తి గురున్నాథం, కొత్తమాసు నాగేశ్వరావు, తమ్మన శ్రీనివాసరావు, పబ్బిశెట్టి శేషారావు, గోపు శ్రీనివాసరావు, పెరుమాళ్ రమేష్, ఘంటసాల శ్రీనివాసరావు తదితర ఆర్యవైశ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పొట్టి శ్రీరాములుకు నివాళి అర్పించారు.





అద్దంకి పాత బస్టాండ్ సెంటర్‌లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి దృశ్యం, పిట్టలవానిపాలెం గ్రంథాలయంలో..



సంతమాగులూరు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళి

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రంథాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు కృపానందం తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: ఆంధ్ర రాష్ట్ర అవతరణకు కృషి చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డివి లలితకుమారి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళు లర్పించగా టిఎం రావు ఉన్నత పాఠశాలలో వాసవి క్లబ్ అధ్యక్షులు కురాళ్ల రవి ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి టి ఉదయ్ భాస్కరి, ఎంపిడిఓ చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం రామకోటేశ్వరరావు, వాసవి క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కనగాల మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆత్మార్పణ చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీ యులని అన్నారు. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ సత్యం, అహింసా ధర్మాలను ఆచరించిన మహనీయుడి పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. రాష్ట్ర అవతరణకు కృషి చేసిన నిస్వార్ధ స్వాతంత్ర్య సమరయోధుడి త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కోగంటి వెంకటేశ్వరరావు, గురికపూడి ప్రసాద్‌రావు, పోతర్లంక కుటుంబరావు, కనపాల బాబు పాల్గొన్నారు.

నగరం: సచివాలయాల తనిఖీలలో భాగంగా గురువారం ఎంపిడీఓ రాధారమణ మండలంలోని పూడివాడ, పెద్దపల్లి సచివాలయాలను సందర్శించారు. ముందుగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పెద్దపల్లి సచివాలయ సిబ్బందితో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన కృషి అజరామరమని ఎంపిడిఒ కొనియాడారు. మాండూస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను గ్రామ వ్యవసాయ సిబ్బంది పారదర్శకంగా నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ముంత వారి సెంటర్లో ఉన్న స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శ భావాలను నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకొని ఆచరించాలని అన్నారు. స్వాతంత్ర్య సమరంలో పొట్టి




చీరాలలో అమరజీవికి కరణం వెంకటేష్ నివాళి

శ్రీరాములు పాత్ర ఎనలేనిదని, ఆయన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతమాగులూరు: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా గురువారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకుడు బాదం విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిద్దరి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.







భట్టిప్రోలు మండలంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాఠశాల విద్యార్థులు, కొల్లూరులో శ్రీరాములుకు నివాళి, అమరజీవికి నగరం ఎంపిడిఒ రాధారమణ నివాళి



విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న ఏఈ చంద్రశేఖర్

భవనంవారిపాలెంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ప్రజాశక్తి-పిట్టలవానిపాలెం

పిట్టలవానిపాలెం మండలంలోని భవనంవారిపాలెం గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ ఏఈ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా వచ్చిన సమస్యను ఇప్పుడు పరిష్కరించినట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. 2023 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించాలని కోరారు. వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకం ప్రతి చేనేత కార్మికునికి వర్తింప చేయాలని అన్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు జరపాలన్నారు. కనీస వేతన చట్టం ప్రస్తుత నిత్యావసర సరుకులకు అనుగుణంగా జివో చేయాలని చెప్పారు. పట్టు నూలు ధరలు 2021 నాటి ధరలకు తగ్గించాలని పేర్కొన్నారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం 2017 మార్చి 30న నిలుపుదల చేసిన జీవిత బీమా సౌకర్యాన్ని, ఆరోగ్య బీమాను పునరుద్ధరించాలి. వయస్సుతో నిమిత్తం లేకుండా లక్షన్నరకు పెంచాలని కోరారు. ప్రతి చేనేత కార్మికునికి అంత్యోదయ కార్డులు ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిరి చేనేత కార్మికులకు రూ.5 లక్షల స్కీమును ప్రవేశపెట్టాలన్నారు. బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలని కోరారు. చేనేత వస్త్రాలపై 20 శాతం రిబేటు కొనసాగించాలని అన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన ఆప్కో బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. స్కూలు పిల్లలకు ప్రభుత్వం ఇస్తున్న వస్త్రాలు చేనేతవే ఇవ్వాలని కోరారు. టెక్స్‌టైల్స్ పార్కులు కాకుండా చేనేత పార్కులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఉచితంగా ఆర్థిక సహాయం చేయాలన్నారు. ప్రయివేటు సెక్టారులోని చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండు అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండు బోర్డు ఏర్పాటు చేయాలి. సొంత ఇల్లు లేని చేనేత కార్మికునికి 3 సెంట్ల స్థలంలో మగ్గం షెడ్తో కూడిన ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇవ్వాలని, లేదా రూ.6 లక్షల నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు ఎం సత్యనారాయణ, డీ సత్యనారాయణ, ఏ వెంకటేశ్వరరావు, వ్యవసాయ సంఘం నాయకులు టీ కృష్ణ మోహన్, కెవిఎన్ఎస్ నాయకులు శరత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లులో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బికె భవనాల నిర్మాణానికి అడ్వాన్సుగా రూ.3.50 లక్షల చెక్కును గురువారం అందజేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఈ భవనాలను పూర్తి చేయనున్నట్లు జడ్పీటీసీ మాజీ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బండారు అనూష, ఎంపిడిఓ సిహెచ్ కృష్ణ, ఏపిఓ ఎస్ రేణుక, ఏపిఎం ఎం కరుణాకర్, గ్రామ కార్యదర్శి డి మోహన్‌బాబు, ఏజర్ల సైమన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

హౌసింగ్ డిఈ దాశరథ శర్మ

ప్రజాశక్తి-పంగులూరు

జగనన్న కాలనీలలోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, గృహ నిర్మాణ శాఖ డిఈ వి దాశరథశర్మ కోరారు. గురువారం మండలంలోని జగనన్న కాలనీలను పరిశీలించేందుకు వచ్చిన ఆయన, స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ శాఖ ద్వారా గృహాలు నిర్మించుకునే వారికి ఇనుము, సిమెంటు, ఇసుక ఇస్తున్నామని, ప్రభుత్వం నుంచి బిల్లులు కూడా వెంటనే వస్తున్నాయని, డబ్బులకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. లబ్ధిదారులైన కాలనీవాసులు, వెంటనే గృహాలు నిర్మించుకోవాలని, అందుకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందని దాశరథశర్మ చెప్పారు. పంగులూరు మండలంలోని కోటపాడు, రామకూరు,



దాశరథ శర్మ

చందలూరు, తూర్పు కొప్పెరపాడు, తూర్పు తక్కెళ్ళపాడు, బూదవాడ గ్రామాలు, గతంలో ఉడా కింద లేవని, అందువలన ఈ గ్రామాలకు గతంలో జగనన్న కాలనీలు మంజూరు కాలేదని చెప్పారు. అయితే ఇప్పుడు అద్దంకి నియోజకవర్గం మొత్తం ఉడా ప్రాజెక్టు కిందకు వెళ్లిందని, పంగులూరు మండలంలోని ఈ ఆరు గ్రామాలు కూడా ఇప్పుడు ఉడా ప్రాజెక్టు కిందకు వచ్చాయని దాశరథశర్మ చెప్పారు. ఇప్పుడు ఈ ఆరు గ్రామాల్లోని జగనన్న కాలనీలలోని లబ్ధిదారులు కూడా గృహ నిర్మాణాలు చేసుకోవచ్చని, అందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద, పంగులూరు మండలానికి 423 ఇళ్లు మంజూరయ్యాయని, వీటిని కూడా వేగంగా నిర్మించుకోవాలని అన్నారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో వేసిన లేఅవుట్‌లోకి, తాము వెళ్లబోమని అక్కడి ప్రజలు చెబుతున్నారు కదా, అని దాశరథి శర్మను ప్రశ్నించగా, అది వాస్తవమేనని ఈ విషయం ఉన్నతాధికారులకు కూడా తెలియజేశామని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే వారికి బ్యాంకు ద్వారా ఇచ్చే రూ.30 వేలు కాకుండా ఇంకా ఎవరికైనా అవసరం అయితే డిఆర్‌డిఏ ద్వారా మరో రూ.30 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గృహాలు నిర్మించుకునే వారు ఎలాంటి సందేహాలు లేకుండా నిర్మించుకోవాలని ఆయన కోరారు.



ప్రచార కరపత్రం ఆవిష్కరిస్తున్న బాబురెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో

ఉద్యమ అభ్యర్థులనే గెలిపించండి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

రానున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు బలపరిచిన ఉద్యమ అభ్యర్థులకే ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి.బాబురెడ్డి కోరారు. ఇంకొల్లులో పలు పాఠశాలలను సందర్శించి.. ఉపాధ్యాయులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బాబురెడ్డి డిమాండ్ చేశారు. యం.యల్.సి ఎన్నికల్లో అర్హులైన వారికి మాత్రమే ఓటు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట నాయకులు, విశ్రాంత ఉపాధ్యాయులు ఉన్నారు.

మాది రైతు ప్రభుత్వం

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైఎస్ఆర్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పుల్లల చెరువు మండలం రంగన్నపాలెం వద్ద నూత నంగా నిర్మించబోతున్న 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన పరిహారం చెక్కులను మంత్రి సురేష్ యర్రగొండపాలెం లోని క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. మొత్తం నలుగురు రైతులకు చెందిన 11.75 ఎకరాలు సబ్‌స్టేషన్ కోసం ఇచ్చారు. వారికి రూ.1,28,12,500 ప్రభు త్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటు ద్వారా రైతులకు విద్యుత్ సమస్యలు తీరిపోతాయన్నారు. రైతుల కోసం నిరంతరం ఆలోచించే రైతు పక్షపాత ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. నియోజకవర్గంలోని



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పుల్లల చెరువు మండలాల్లో 14 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను మంత్రి అందజేశారు. 14 మందికి గానూ రూ.14.73 లక్షల చెక్కులు అందజేశారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన మహానీయుడు శ్రీ అమరజీవి పొట్టిశ్రీరాములు అని రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహానీయుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ ఉడుములు శ్రీనివాసరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్‌గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, జిల్లా కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాదీర్‌బాషా, సర్పంచి రామావత్ అరుణాబాయి, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, కొప్పర్తి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయమంటే ప్రజాసేవ: ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

రాజకీయమంటే ప్యాషనో, వ్యాపారమో కాదని ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయటమేనని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి, వెలిగండ్ల మండల పార్టీ శ్రేణులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో ఉండి.. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న ఉగ్ర నరసింహారెడ్డి

పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ కనిగిరి మండల అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, బి.పుల్లారెడ్డి, ముచ్చుమారి చెంచిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, బుడేసాహెబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంఇఒ పి.ఆంజనేయులు అన్నారు. గురువారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో మండలానికి వచ్చిన 973 ట్యాబ్‌లను ప్రధానోపాధ్యా యులకు పంపిణీ చేశారు. వీటిని ఈ నెల 21న సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ ట్యాబ్‌లలో బైజ్యూస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొనే ప్రక్రియ పూర్తయిందన్నారు. 8వ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే బైజ్యూస్ ద్వారా తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీకాంత్, వినయ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కరణం బలరాం

ప్రజాశక్తి-చీరాల

బ్యాంకు రుణాలను సద్విని యోగం చేసుకోవాలని, అదేవిధంగా రుణ సదుపాయం పొందిన వారు తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవాలని చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ అన్నారు. వాడరేవులో ప్రమాదానికి గురై పడవ కాలిపోయిన బాధితురాలు దోనే పొలేరుకు వెలుగు ఏపీఎం సుబ్బారావు సహకారంతో రూ.5 లక్షలు బ్యాంకు ద్వారా రుణ సదుపాయం కల్పించారు. బ్యాంక్ డిడిని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, కరణం వెంకటేష్ అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం

వినియోగించుకొని.. మహిళలు తమ ఆర్థిక స్థితిగతులు మెరుగుపరుచుకోవాలని అన్నారు. రూ.పది లక్షలు విలువైన పడవ కాలిపోయిన బాధిత మహిళ కుటుంబానికి ఏపీఎం సుబ్బారావు బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేసినందుకు అభినందిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో విఓఏ నాగరత్నం, వాడరేవు మాజీ సర్పంచ్ ఏరిపిల్లి రమణ పాల్గొన్నారు

కల్తీ డీజిల్ పోశారని నిరసన

ప్రజాశక్తి-చీరాల

పెట్రోలు బంకు నిర్వాహకులు డీజిల్లో నీళ్ల కలిపి వాహనదారులను మోసం చేస్తున్నారని ఓ ఆటో డ్రైవర్ గురువారం కారంచేడు గేట్ వద్ద ఉన్న పెట్రోలు బంకు వద్ద నిరసన తెలియజేశాడు. బాధితుడు.. తెలిపిన వివరాల ప్రకారం.. ఆటో డ్రైవర్ శ్రీను తన ఆటోలో 500 రూపాయల డీజిల్ కొట్టించుకొని బాడుగకు బయలుదేరి వెళ్లాడు. అయితే మార్గమధ్యలో ఆటో ఆగిపోయి ఆటో ఇంజన్ నుండి నీళ్లు కారటం చూసి అవాక్కయ్యాడు. శ్రీను వెంటనే ఆటోని తోసుకుంటూ డీజిల్ కొట్టించిన పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి నిర్వాహకులను నిలదీశాడు. ఆ వెంటనే ఆటోలో ఉన్న డీజిల్‌ను వాటర్‌బాటిల్‌లో నింపి నిర్వాహకులకు చూపించి కల్తీ జరిగిందంటూ ప్రశ్నించాడు.



కల్తీ డీజిల్‌ని చూపుతున్న ఆటోడ్రైవర్

విషయాన్ని గమనించిన స్థానికులు డ్రైవర్‌కు మద్దతుగా నిర్వాహకులపై మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి కల్తీ విక్రయాలు పునరావృతం కాకుండా పెట్రోల్ బంకుల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 'జార్జి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ హ్యూండాయ్ గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో జార్జి ఇంజనీరింగ్ కళాశాల నాలుగో సంవత్సర విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. కంపెనీ సీనియర్ మేనేజర్ మాలిక్ సిద్ధికి అలిఖాన్ బృందం ఈ ఎంపికలను నిర్వహించినట్లు ప్లేస్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా మెకానిక్ మరియు ఇఇఇ విభాగానికి చెందిన విద్యార్థులు వ్రాత పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. చివరగా 17 మంది (మెకానికల్-8, ఇఇఇ-09) మంది విద్యార్థులు ఈ ఎంపిక ప్రక్రియలో ఉద్యోగాలు సాధించినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కుమార్ తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు రూ.2 లక్షల వేతనం అందుతుందని డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ తెలిపారు. అభినందించిన వారిలో జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపల్, డీన్ అకడమిక్స్, వివిధ విభాగాల అధిపతులు ఉన్నారు.

పండగ వేళల్లో

ముందస్తు భద్రతలు తప్పనిసరి

ఎస్పీ వకుల్ జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రానున్న క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలను దృష్టిలో ఉంచుకొని తగిన ముందస్తు ఏర్పాట్లను చేయాలని, కోడిపందేలు నిర్వహించే వారిపై, పేకాట ఆడే వారిపై నిఘా ఉంచాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. గురువారం నూతనంగా ప్రారంభించిన జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో కోడిపందాలు, పేకాట ఆడుతూ పట్టుబడ్డ వారిని మరలా వాటి జోలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే బైండోవర్ చేయాలని పేర్కొన్నారు. నూతన సంవత్సరం, క్రిస్మస్ రాత్రి సమయాలలో వేగంగా బైకులను నడిపే



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

వారిని, అధిక ధ్వనులు సృష్టిస్తూ బైకులు నడిపేవారిని నియంత్రించాలని అన్నారు. సీసీటీఎన్ఎస్‌లో ప్రతి కేసునూ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తెలిపారు. సాయంత్రం సమయాలలో బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద కాలేజీల వద్ద విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. బైండోవర్ అతిక్రమించే వారిపై ఎమ్మార్వో సమక్షంలో ఫైన్ వేయించాలన్నారు. డయల్ 100 కాల్స్ పట్ల త్వరితగతిన స్పందించాలని, వీటి విషయంలో నిర్లక్ష్యం చేసే వారి మీద చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. ప్రాపర్టీ రిజిస్టర్లను ఖచ్చితంగా నిర్వహించాలని, చిన్న కేసులలో సైతం ప్రాపర్టీని సీజ్ చేసి రిజిస్టర్‌లో నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్లు ఏ.శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, టి.మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ, అడ్మిన్ ఆర్‌ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్‌నాయక్, జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లు, అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు, డిపిఒ అధికారులు పాల్గొన్నారు.